ఆంధ్రజ్యోతి
3
చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024




రిలాక్స్.. రిలాక్స్

- విదేశాలకు కొందరు.. పక్కరాష్ట్రాలకు మరికొందరు
- స్థానికంగానే ఇంకొందరు
- పోలింగ్ తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇలా..

తొలుత టిక్కెట్ కోసం టెన్షన్. ఆపై నగదు సమకూర్చుకోవడం. అదే సమయంలో తమ పార్టీల్లోని ఆశావహులు, నేతల మద్దతు పొందడం. ఆపై నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారాలు. పోలింగ్ హడావిడి. పెరిగిన ఓటింగ్ ఎవరికి అనుకూలమనే ఉత్కంఠ. ప్రాంతాలవారీగా పోలింగ్‌పై సమీక్షలు. ఏ ఊర్లో మెజార్టీ వస్తుంది.. ఏ నేత బాగా కష్టపడ్డారు.. ఎంత ఖర్చయింది.. వంటి అంచనాల లెక్కలు. తమతో పాటు పోలింగ్ వరకూ కష్టపడిన నేతలు, శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పే కార్యక్రమం. ఇలా రెండు నెలలు క్షణం తీరిక లేకుండా గడిపిన ప్రధాన పార్టీల అభ్యర్థులు.. నెమ్మదిగా రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు విహార యాత్రలకు వెళితే.. మరికొందరు పుణ్యక్షేత్రాలు తిరుగుతున్నారు. ఇంకొందరు తమ వ్యాపారాలు.. దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు టెన్షన్‌ను అధిగమించేందుకు బిజీ బిజీగా గడుపుతున్నారు. జిల్లాలోని ఆయా అభ్యర్థులు ప్రస్తుతం ఏం చేస్తున్నారనే అంశంపై ప్రత్యేక కథనం..

– ఆంధ్రజ్యోతి, చిత్తూరు

విదేశీ యాత్రలో టీడీపీ అధినేత



టీడీపీ అధినేత, కుప్పం టీడీపీ అభ్యర్థి చంద్రబాబు నాయుడు పోలింగ్ తర్వాత కొద్దిరోజులు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పోలింగ్ తీరును శ్రేణులతో సమీక్షించారు. టెలీ కాన్ఫరెన్సు ద్వారా కుప్పం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో మాట్లాడి, కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఆయన విదేశీ యాత్రకు బయలుదేరి వెళ్లారు.

● కుప్పం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన ఎమ్మెల్సీ భరత్ పోలింగ్ తర్వాత ఓ రోజు ఓటింగ్‌పై సమీక్షించారు. రెండో రోజున హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు.

యూరప్ వెళ్లిన గురజాల

చిత్తూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఎన్నికల తర్వాత రెండు రోజులు చిత్తూరులోనే ఉండి నాయకులతో పోలింగ్ సరళి గురించి సమీక్షించారు. ఆ తర్వాత బెంగళూరు వెళ్లి అక్కడి వ్యాపార కార్యకలాపాల్లో బిజీగా గడిపారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ యాత్రకు వెళ్లారు.

● వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి పోలింగ్ తర్వాత రెండు రోజులు చిత్తూరులోనే ఉండి నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. 17వ తేదీ నుంచి విజయవాడ పార్టీ కార్యాలయంలో వైసీపీ పెద్దలతో కలుస్తున్నట్లు సమాచారం.

హైదరాబాదులో దగ్గుమళ్ల.. ఇంటి నిర్మాణ పనుల్లో రెడ్డప్ప

● చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు పోలింగ్ తర్వాత 16వ తేదీ వరకు చిత్తూరులో అందుబాటులో ఉండి.. పార్లమెంటు పరిధిలోని నాయకులతో పోలింగ్ సరళిపై సమీక్షించారు. వైసీపీ నేతల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని తిరుపతి స్విమ్స్‌లో పరామర్శించారు. 17 నుంచి హైదరాబాదులోని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో గడుపుతున్నారు. మధ్యలో విజయవాడలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి పార్టీ పెద్దలతో సమావేశమయ్యారు.

● వైసీపీ అభ్యర్థి, ఎంపీ రెడ్డెప్ప పోలింగ్ తర్వాత నుంచి పుంగనూరులోని తన నివాసంలోనే ఉంటున్నారు. సోమల మండలం వల్లిగట్ల గ్రామంలో ఆయన నూతన గృహాన్ని నిర్మిస్తుండగా.. రోజూ అక్కడికి వెళ్లి పనులు పర్యవేక్షిస్తున్నారు.

తిరుపతిలోనే పెద్దిరెడ్డి

పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పోలింగ్ పూర్తయిన మరుసటి రోజు నుంచి స్థానికంగా అందుబాటులో లేరు. కుటుంబ సభ్యులతో బెంగళూరులో రిలాక్స్ అవుతున్నట్లు సమాచారం.

వైసీపీ అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోలింగ్ వరకు నియోజకవర్గంలో ఉన్నా.. ఆ తర్వాత జిల్లాలో ఎక్కడా కనిపించలేదు. ఆదివారం తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించారు.

అందుబాటులోనే అమరనాథరెడ్డి

పలమనేరు నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి పోలింగ్ తర్వాత ఓటర్లకు, కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వైసీపీ నేతల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని తిరుపతి స్విమ్స్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు మూడు రోజుల పర్యటన కోసం వెళ్లిన ఆయన సోమవారం పలమనేరు చేరుకున్నారు. మంగళవారం గంగజాతరలో పాల్గొనడంతో పాటు శ్రేణులతో సమావేశం కానున్నారు.

● వైసీపీ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ పోలింగ్ తర్వాత బెంగళూరులోని తన నివాసంలో ఉంటూ, అక్కడి వ్యాపార లావాదేవీలను చూసుకుంటున్నారు.

చెన్నై నివాసంలో రోజా

నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పోలింగ్ తర్వాత స్థానికంగా నాయకులతో సమీక్షించారు. ఆ తర్వాత తిరుత్తణి గుడిలో దర్శనం చేసుకుని విజయపురం మండలం జగన్నాథపురంలో వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన సర్పంచి నారాయణరాజు కుటుంబాన్ని పరామర్శించారు. 15న హైదరాబాదులోని నివాసానికి వెళ్లిన ఆయన మంగళవారం తిరుపతికి రానున్నట్లు సమాచారం.

● నగరి వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజా పోలింగ్ తర్వాత రెండు రోజుల పాటు స్థానికంగా ఉండి సమీక్షించారు. అనంతరం శిర్డి, వారణాసి వెళ్లారు. ఇటీవల వడమాలపేట ఎస్బీఐ పురంలో ముగ్గురు బాలికలు చెరువులో పడి మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రస్తుతం చెన్నైలోని నివాసంలో కుటుంబంతో కలిసి ఉంటున్నట్లు సమాచారం. సోమవారం తమిళనాడులోని అరుణాచలేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు.



సోమవారం అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకున్న రోజా

ఆస్పత్రిలో తల్లిని చూసుకుంటున్న కృపాలక్ష్మి

● జీడీనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ పోలింగ్ తర్వాత దుబాయ్ వెళ్లి తన ఫెర్టిలిటీ సెంటర్ కార్యకలాపాలను చూసుకున్నారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసానికి వచ్చి శ్రేణులతో సమావేశమయ్యారు. సోమవారం చెన్నైలోని ఫెర్టిలిటీ సెంటర్‌లో రెగ్యులర్ డ్యూటీస్ చూసుకున్నారు. మంగళవారం ఫెర్టిలిటీ సెంటర్ కార్యకలాపాల్లో భాగంగా అబ్రాడ్ వెళ్లనున్నట్లు సమాచారం.

● ఇక్కడి వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి పోలింగ్ తర్వాత స్థానికంగా అందుబాటులో ఉంటూ నాయకులతో సమీక్షించారు. తన తల్లి ఆరోగ్యం బాగలేక చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఉండడంతో, ఆదివారం నుంచి తల్లికి తోడుగా ఉంటున్నారు.



ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో థామస్‌కు శ్రేణుల సన్మానం



విజయవాడ దుర్గమ్మ గుడి వద్ద మురళీమోహన్

స్థానికంగానే పూతలపట్టు అభ్యర్థులు

● పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ పోలింగ్ తర్వాత ఐదు రోజుల పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పర్యటించి కష్టపడిన శ్రేణులకు అభినందనలు తెలిపారు. యాదమరి, బంగారుపాళ్యం ప్రాంతాల్లో వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు. తప్పుడు కేసుల్లో ఉన్న శ్రేణులకు ధైర్యం చెప్పారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లి.. సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. మంగళవారం నుంచి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారు.

● వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ పోలింగ్ తర్వాత ఎక్కడికీ వెళ్లలేదు. పలమనేరులోని తన ఆస్పత్రిని చూసుకుంటూ.. నియోజకవర్గంలోని నాయకులతో సమీక్షలు చేసుకుంటున్నారు.



పలమనేరులోని తన నివాసంలో సునీల్‌కుమార్‌ను కలిసిన వైసీపీ నేతలు

కుప్పం గంగజాతర

శిరస్సులేని దేహానికి పూజలు

ఖండిత శిరస్సుకు ఊరేగింపు

● రేపు విశ్వరూప దర్శనం

కుప్పం, మే 20: శిరస్సులేని దేహానికి ఏడాదికోసారి జరిగే వేడుకలే కుప్పం జాతర ఉత్సవాలు. ఇక్కడ కొలువైన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఏడాదిలో ఒకే ఒక్కరోజు మాత్రమే జాతరలో శిరస్సుతో కనిపిస్తుంది. సంపూర్ణశక్తిగా దర్శమిచ్చే అమ్మవారిని కొలిచి తరించేందుకు అందుకే ప్రజలు కుప్పం జాతర కోసం ఇంతగా ఎదురు చూస్తారు. జాతరలో నేడు అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనం ఉంటాయి. ఏడాది పొడవునా తెర వెనుకనే ఉండిపోయిన శిరస్సులేని గంగమ్మకి జాతర రోజుల్లో మాత్రమే తెర తొలగించి పూజలు చేస్తారు. అయితే పక్కనే ముత్తుమారెమ్మ రూపంలో గంగమాంబ ఏడాదంతా సేవలందుకుంటుంది. ఈ వారం రోజులూ శిరస్సు భాగంలో వేపమండలు అమర్చిన అమ్మ అసంపూర్ణ దేహం పూజలందుకుంటుంది. జాతరకు ఏపీ, తమిళనాడునుంచి భక్తజనం తండోపతండాలుగా తరలి వస్తారు. కుప్పం పరిసర గ్రామాలలోనూ వేడుకలు చేసుకుంటారు. జాతరకోసం దూర ప్రాంతాలలో ఉన్న తమ బంధుమిత్రులకు ఆహ్వానం పంపుతారు. మాంసాహార వంటకాలతో విందులు చేస్తారు.

వారం రోజుల సంబరాలు: కుప్పం గంగమ్మ జాతర మే నెలలో జరుగుతుంది. వారం రోజులపాటు సంబరాలు ఉంటాయి. ముత్తుమారెమ్మకు వాహన సేవలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజున పల్లకీ సేవ, రెండు, మూడు, నాల్గవ రోజుల్లో శేష, సింహ, అశ్వ వాహన సేవలు, ఐదవ రోజున అగ్నిగుండ మహోత్సవం, పుష్ప పల్లకీ సేవలు జరిగాయి. ఆరవ రోజైన మంగళవారం గంగమ్మ శిరస్సును పట్టణ వీధుల్లో ఊరేగిస్తారు. 25-39 గంటలపాటు ఊరేగింపు సాగుతుంది. అనంతరం శిరస్సును తీసుకొచ్చి ఆలయంలో అసంపూర్ణంగా ఉన్న అమ్మవారి మొండేనికి అమరుస్తారు. ఏడవ రోజున బుధవారం నాడు భక్తులకు అమ్మవారు శిరస్సుతో విశ్వరూప దర్శనం ప్రసాదిస్తారు. ఈ రెండు రోజులూ భక్తులు వివిధరకాలైన వేషధారణలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. విశ్వరూప దర్శనం అనంతరం తెల్లవారుఝామున గంగమ్మను జలావాసం చేయించడంతో జాతర ముగుస్తుంది.

బలులు: శిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శనాల రోజుల్లో విరివిగా జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. రెండు రోజులూ కుప్పం వీధులు రక్తసిక్తమవుతాయి. ఇలా చేయడంవల్ల అమ్మవారిలోని ఉగ్రత ఉపశమించి, ప్రసన్నంగా మారి కోరిన వరాలిస్తారని నమ్మకం.



గంగమ్మ శిరస్సు ఊరేగింపు (ఫైల్ ఫొటో)



పూజలందుకుంటున్న అమ్మవారి అసంపూర్ణ దేహం

గంగమ్మ శిరస్సు కథ...

గంగమ్మకు తల ఏమైందన్నదానిపై జానపద ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఆ కథ ఇదీ.. ఏడుకొండల మీద ఉండే శ్రీనివాసుడికి గంగమ్మ చెల్లెలు. అన్న శాంతస్వభావి అయితే, చెల్లెలు ఉగ్రరూపి. ఆగ్రహోదగ్రియై తిరిగేది. రూపు భీకరంగా ఉండేది. రాత్రివేళ శ్మశానాల్లో తిరుగులాడేది. కోపావేశంలో శవాలను పీక్కుతినేది. గంగమ్మను చూసి జనం భయంతో వణికిపోయేవారు. అందరూ కలిసి ఏడుకొండలెక్కి స్వామికి మొరపెట్టుకున్నారు. చెల్లెలి భీకర చేష్టలు విన్న వేంకటేశ్వరుడు ఆగ్రహంతో రగిలిపోయాడు. కుప్పానికి వచ్చి చెల్లెలి తీరు చూశాడు. అంతే చెల్లెలని కూడా చూడకుండా చక్రం వదిలి ఆమె తల ఒక్కవేటుకి నరికేశాడు. తెగిపడ్డ తల నెత్తురోడుతూనే రోదించింది. అన్నను వేడుకుంది. దాంతో శాంతించిన ఆయన ఏడాదిలో ఒక్కరోజు మాత్రం శిరస్సును ధరించి సంపూర్ణ రూపంలో కనిపిస్తావు. భక్తుల పూజలు అందుకుంటావు అని వరమిచ్చాడు. ఆ ప్రకారమే ఏడాదికోసారి విశ్వరూప దర్శనం. జాతర సంబరాలు అని ప్రజల నమ్మకం. సృష్టిలో ఏదీ సంపూర్ణం కాదు అనేందుకు ఈ జాతర సంకేతమని కూడా విశ్లేషిస్తారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

● భారీ వర్షం నడుమ పోటెత్తిన భక్తజనం

కణకణ మండుతున్న నిప్పుల గుండం. భీకరాకారంలో ముత్తుమారెమ్మ రూపం. భక్తిపారవశ్యంలో భక్తలోకం. భారీ వర్షం నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం ఒళ్లు గగుర్పొడిచే రీతిలో సాగి, భక్తకోటికి తన్మయత్వాన్ని కలిగించింది. గంగ జాతర మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి ముత్తుమారెమ్మ అగ్నిగుండ మహోత్సవం వైభవంగా జరిగింది. ముత్తుమారెమ్మ ఉత్సవమూర్తిని పల్లకీపై ఊరేగింపుగా అగ్నిగుండం వద్దకు వేంచేపు చేశారు. ఆకుపచ్చటి ఛాయతో, విశాలమైన ఎర్రటి కనుగుడ్లతో భీకరంగా ఉన్న అమ్మవారి స్వరూపం భక్తులకు భయానికి బదులు భక్తిని కలిగించింది. సరిగ్గా అమ్మవారు కదలి వచ్చే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. గుండం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేసి అమ్మవారు నిలిచిన తర్వాత, తొలుత గరికె పట్టుకున్న పూజారి అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారి ప్రవేశం జరిగింది. శిరఃస్నానాలు ఆచరించి, ఎరుపు దుస్తులు ధరించి, చేత వేపమండలతో నీరోడుతున్న శరీరాలతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులూ ఒక్కొక్కరుగా కణకణమండే నిప్పుల కణికలపై నడిచారు. మూడు రాష్ట్రాలనుంచి తరలివచ్చిన భక్తజనులతో గంగమ్మ ఆలయ ప్రదేశం కిక్కిరిసింది.



వర్షంలో గుండం వద్దకు వస్తున్న ముత్తుమారెమ్మ ఉత్సవమూర్తి

చంద్రబాబు గంగజాతర శుభాకాంక్షలు

‘కుప్పంలో కొలువైన ప్రసన్న గంగమ్మ తల్లి జాతర సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు, అభినందనలు. అమ్మలగన్న అమ్మ ఈ గంగమ్మతల్లి దీవెనలు మనందరిపైనా ఉంది. మనందరికీ సుఖసంతోషాల్ని ప్రసాదించాల్సిందిగా ఆతల్లిని కోరుకుంటున్నాను. జై గంగమ్మతల్లి.. జైజై గంగమ్మతల్లి’ అంటూ స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు సోమవారం ప్రజలకు గంగజాతర శుభాకాంక్షలు తెలుపుతూ వీడియో సందేశం పంపించారు.



అగ్నిగుండ ప్రవేశానికి గరికెతో వస్తున్న పూజారి

చిత్తూరులో నేడు నడివీధి గంగమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, మే 20: చిత్తూరులో మంగళవారం నడివీధి గంగజాతర జరగనుంది. కోసం ఉత్సవ మంటపం వద్ద సోమవారం రాత్రికి ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాడానికి బారికేడ్లు, చలువ పందిళ్లు, మంటపానికి విద్యుత్తు దీపాలంకరణ తదితర ఏర్పాట్లు చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టింది. మంగళవరం ఉతవయం వంశపారంపర్య ధర్మకర్త సీకే జయచంద్రారెడ్డి దంపతులు అమ్మవారికి తొలిపూజ చేశాక భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి అంబలి సమర్పిస్తారు. రాత్రి 10 గంటల వరకు అమ్మవారిని భక్తులు దర్శించి పూజలు చేయడానికి అనువుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కాగా, బుధవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా కట్టమంచి రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలోని గంగజాతర బావి వద్దకు తీసుకొచ్చి నిమజ్జన పూజలు చేసి నీటిలో అమ్మవారిని కలపడంతో గంగజాతర ముగుస్తుంది.





బజారువీధిలో గంగజాతరకు ఏర్పాటు చేసిన పందిళ్ళు - నడివీధి గంగమ్మ (ఫైల్ ఫొటో)

బాటిళ్లు, క్యాన్లకు నో పెట్రోల్

‘పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే డీజిల్, పెట్రోల్ పట్టాలి. ఎవరైనా బాటిళ్లు, క్యాన్లు తీసుకొస్తే పట్టకూడదు. కాదూ కూడదని పడితే లైసెన్సు రద్దు చేస్తాం’ అంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ హెచ్చరించారు. రాష్ట్రంలో తలెత్తిన పోలింగ్ అనంతర హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. దీన్ని కచ్చితంగా అమలు చేయాలంటూ జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పెట్రోల్ బంకులపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈసీ ఉత్తర్వులను పెట్రోల్ బంకుల యజమానులు తప్పనిసరిగా పాటించాలన్నారు.

– చిత్తూరు కలెక్టరేట్

నో మెన్ జోన్‌గా ఎస్వీసెట్

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని నో మెన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. జిల్లాలోని చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ఎస్వీ సెట్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. మూడంచెల విధానంతో పోలీసు యంత్రాంగం కాపలా కాస్తోంది. 144 సెక్షన్‌నూ విధించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి విధులకు హాజరైన కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది గుర్తింపుకార్డులను పరిశీలించి, వారి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, లోనికి అనుమతించారు.

– చిత్తూరు కలెక్టరేట్

ఓట్ల లెక్కింపు కోసం 22 కేంద్రాల గుర్తింపు

చిత్తూరు కలెక్టరేట్, మే 20: వచ్చేనెల 4న జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 22 కేంద్రాలను గుర్తించారు. ఈనెల 13న పోలింగ్ అనంతరం ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో గుర్తించిన స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచారు. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు సంబంధించి ఈవీఎంల భద్రతకు స్ట్రాంగ్ రూమ్‌లుగా 28 గదులు, ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రాలుగా 22 గదులు, అదనపు గదులుగా 14 గదులు వెరసి 64 గదులను గుర్తించారు. కాగా కళాశాలలోని ఏ, బీ బ్లాక్‌ల్లో ఉన్న గదుల్లో రిజర్వ్, డిఫెక్టివ్ ఈవీఎంల నిల్వల కోసం అసెంబ్లీకి ఏడు, పార్లమెంటుకు ఏడు గదులు కేటాయించారు.

ఊయలే ఉరితాడై..!

● 9 ఏళ్ల బాలిక మృతి

కల్లూరు, మే 20: సరదాగా ఆడుకుంటున్న ఊయలే ఉరితాడుగా మారింది. 9 ఏళ్ల బాలిక ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన సోమవారం పులిచెర్ల మండలం కల్లూరులోని దిగువవీధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సదుం మండలం తిమ్మానాయనిపల్లి పంచాయతీ అగ్రహారానికి చెందిన హర్షద్ అలీ, ఆయేషా దంపతులు సదుం జాండ్రపేటలో నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తెలు మోషిన్, మోమిన్ (9). ఇటీవల అనారోగ్యానికి గురై తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న భర్త వద్ద ఆయేషా ఉంటున్నారు. వీరి పిల్లలు ఆదివారం కల్లూరులోని అమ్మమ్మ షంషాద్ ఇంటికి వచ్చారు. సోమవారం మనవరాళ్లను ఇంటివద్ద వదిలి ఆమె అల్లుడిని చూసేందుకు స్విమ్స్‌కు వెళ్లారు. మోషిన్ నిద్రపోగా.. ఈమె చెల్లెలు మోమిన్ చీరతో ఏర్పాటుచేసిన ఊయలలో ఊగుతూ.. ఆటలాడుతోంది. ప్రమాదవశాత్తు చీర మెడకు చుట్టుకొని ఊపిరాడక కొట్టుమిట్టాడుతుండగా మోషిన్ నిద్రలేచి గమనించింది. ఈమె కేకలతో పక్కనున్న బంధువులు వచ్చి మోమిన్‌ను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఆయేషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మోమిన్ మృతదేహం

ప్రమాదంలో కాలు కోల్పోయా..

వైద్య చికిత్సకు సాయంచేసి ఆదుకోండి ● దాతలకు బాధితుడు గణేశ్ విజ్ఞప్తి

పుంగనూరు, మే 20: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు చికిత్స కోసం రూ.13లక్షలు ఖర్చవుతుందని బాధితుడు గణేశ్ తెలిపారు. ఈ మొత్తాన్ని భరించే స్తోమత లేని తనకు దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. సోమల మండలానికి చెందిన ఈయన ప్రస్తుతం సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు తెలిపిన మేరకు.. వల్లిగట్ల పంచాయతీ కూకటివారిపల్లెకు చెందిన జి.సీతప్ప కుమారుడు జి.గణేశ్ ఎంఏ వరకు చదివి గ్రూప్స్, ఎస్ఐ తదితర ఉద్యోగాలకు తిరుపతిలో శిక్షణ పొందుతున్నారు. ఈనెల 10వతేది తన స్నేహితుడితో కలిసి తిరుపతి నుంచి మోటారు సైకిల్‌పై వస్తుండగా పాకాల మండలం దామలచెరువు వద్ద ఎదురుగా వస్తున్న వస్తున్న వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేశ్ కుడికాలు పూర్తిగా తెగిపోయింది. అతడి స్నేహితుడూ గాయపడ్డారు. క్షతగాత్రులే 108కు ఫోన్ చేయగా వాహనాలు అందుబాటులో లేవని సమాధానం వచ్చింది. వీరిద్దరిని గమనించిన కొందరు తమిళనాడు రాష్ట్రం వేలూరు సీఎంసీ వైద్యశాలకు హుటాహుటిన తీసుకెళ్లారు. తెగిపోయిన కాలు అమర్చడం వీలుకాదని, ప్రమాదానికి గురైన కాలు ఇన్ఫెక్షన్ వల్ల మరికొంత తీసేయాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే శరీరంలో కొన్ని ఎముకలు విరిగాయని వైద్యచికిత్సల కోసం రూ.13 లక్షలు అవసరం అవుతుందని చెప్పారు. పేదకుటుంబం, వృద్ధులైన తల్లిదండ్రులు అంత మొత్తం భరించే పరిస్థితి లేకుండా పోయింది. అప్పటికే బిడ్డను కాపాడుకోవడానికి అప్పులు చేసిన తెచ్చిన డబ్బు ఏమాత్రం సరిపోవడంలేదు. ఎవరైనా దాతలు స్పందించి ఆదుకొని వైద్యచికిత్సలకు సహాయపడాలిన గణేశ్ కోరారు. తన పీలేరు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతానెంబరు 41339163182, ఐఎఫ్ఎస్సీ నెంబరు ఎస్బీఐఎన్0016428, ఫోన్‌పే నెంబర్లు 8374557403, 6304496763కు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.



వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న గణేశ్

14 రీచుల్లో గడువు ముగిసింది

ఇసుక తవ్వి తరలిస్తే చర్యలు తప్పవంటూ జేసీ హెచ్చరిక

చిత్తూరు రూరల్, మే 20: జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన 14 ఇసుక రీచుల్లో మైనింగ్‌కు గడువు ముగిసిందని, జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఇకపై వాగులు, వంకలు, నదుల్లో మైనింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, బీఎన్ఆర్ పేట, ముత్తుకూరు, ఆనగల్లు ఇసుక రీచ్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. కొన్ని రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు వివిధ శాఖల అధికారులతో కలిసి ఇసుక రీచులను పరిశబూలించామన్నారు. కొత్త పాలసీ వచ్చేవరకు ఎవరైనా అక్రమంగా మైనింగ్ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు, గనుల శాఖ డీడీ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ మదన్ మోహన్, డీపీవో లక్ష్మి, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలోని నందనూరు, కొట్రకోన, ముక్కళత్తూరు గ్రామాల వద్ద గల ఇసుక రీచ్‌లను సోమవారం అధికారులతో కలిసి జేసీ తనిఖీ చేశారు. ప్రస్తుతం రీచ్‌ల నుంచి ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయినట్లు జేసీ పేర్కొన్నారు. జిల్లా అధికారులతో పాటు స్థానిక తహసీల్దార్ రవి, డీటీ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకుంటే మాపై కేసులు పెట్టారు

జేసీకి ఓజీకుప్పం వాసుల ఫిర్యాదు

నగరి, మే 20: నగరి మండలం ఓజీకుప్పంలో ఇసుక రీచ్‌ను సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించిన జేసీ శ్రీనివాసులు స్థానిక రైతులతో మాట్లాడారు. ఇసుకను రాత్రి వేళల్లో ఇష్టానుసారం తరలించడంతో భూగర్భజలాలు అడుగంటి.. పంటలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇకను అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు తమ గ్రామస్తులపై కేసులు పెట్టారని వారు జేసీ దృష్టికి తీసుకొచ్చారు.అధికారపార్టీ అండదండలతో రాత్రి వేళల్లో తమిళనాడుకు ఇసుక అక్రమరవాణా చేపట్టారని ప్రశ్నిస్తే తమను బెదిరించేవారన్నారు. ఇసుక తరలిస్తే అధికారుల దృష్టికి తీసుకు రావాలని జేసీ కోరారు. రీచ్ గడువు ముగియడంతో ఇసుక తరలించరాదని హెచ్చరిక బోర్డులు పెట్టాలని, గ్రామాలలో దండోరా వేయించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన సూచించారు.



నగరి మండలం ఓజీకుప్పం ఇసుక రీచ్ వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ

సిట్ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు

చంద్రగిరి పోలీసుల వైఖరిపై సిట్ నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన హింసాత్మక ఘటనలకు పోలీసుల వైఫల్యమే ప్రధాన కారణంగా సిట్ అధికారులు గుర్తించారు. అలాగే సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా పద్మావతి వర్సిటీ వద్ద నానీపై వైసీపీ శ్రేణులు మారణాయుధాలతో హత్యాయత్నానికి ప్రయత్నించినా సీరియస్‌గా పరిగణించకుండా కేవలం హత్యాయత్నం జరిగిందని 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం సిట్ గుర్తించింది.సీఐ రామచంద్రరెడ్డి వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో 21మందిని నిందితులుగా గుర్తించి 41ఏ కింద నోటీసులు జారీ చేశారు.కూచువారిపల్లిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన దాడులు, ప్రతి దాడులకు సంబంధించి రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర రెడ్డి, మోహిత్ రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వరరెడ్డి, పీఆర్వో బండి వేణుగోపాల రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మూడు కేసుల్లో దాదాపు 64మందిని నిందితులుగా గుర్తించారు. వీరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో వుంచిన సెక్షన్లు సీరియస్‌గా వున్నా భారీసంఖ్యలో వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా కర్రలు, రాడ్లు, రాళ్ళతో టీడీపీ నాయకులు, గ్రామస్తులపై దాడి చేసి గాయపరచిన ఘటనకు సంబంధించి మాత్రం కేవలం ముగ్గురు నిందుతులను మాత్రమే నమోదు చేయడం పోలీసుల పక్షపాతానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి. ఈ నాలుగు కేసుల్లో ఇప్పటివరకూ చంద్రగిరి పోలీసులు ఏ ఒక్క నిందితుడినీ అరెస్టు చేయక పోవడాన్ని సిట్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనిపై సోమవారం చంద్రగిరి డీఎస్పీపై జిల్లాస్థాయి ఉన్నతాధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే బ్రాహ్మణకాలువలో పోలింగ్ రోజు వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య జరిగిన గొడవల్లో దాదాపు 10 మంది గాయపడినట్లు సమాచారం. ఇరువర్గాలను చెదరగొట్టడానికి సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే ఇక్కడ కూడా నిందితులను అరెస్టు చేయలేదని సిట్ సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ గుర్తించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లలో కొత్త సెక్షన్లు చేర్చే విషయమై ఉన్నతాధికారులకు సిపార్సు చేశారు.కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించినా అవసరమైనన్ని బలగాలను నియమించడంలోనూ,ఘటనలను నివారించడంలోనూ పోలీసుల వైఫల్యాన్ని సిట్ నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులపై వేటు పడే అవకాశం వుందని తెలిసింది.



రామిరెడ్డిపల్లెలో సిట్ అధికారుల విచారణ

పోలీసు వైఫల్యమే!

ఎన్నికల కేసుల్లో నిందితుల అరెస్టుకు డీజీపీ ఆదేశం

జిల్లాలో సుమారు వంద మందిపై నమోదైన కేసులు

నానీపై దాడి కేసులో 13 మంది మాత్రమే అరెస్టు

మిగిలిన కేసుల్లో నిందితుల అరెస్టుకు ఐదు బృందాల ఏర్పాటు

సిట్ అధికారుల నివేదిక పర్యవసానం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలకు సంబంధించిన కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డీజీపీ హరీష్ గుప్తా ఆదేశించారు. ఈనెల 13న పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఇప్పటి వరకూ 13మందిని మాత్రమే అరెస్టు చేశారు. మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయలేదని సిట్ అధికారులు తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో ఇప్పటివరకూ అరెస్టు కాని నిందితులను 24 గంటల్లో అరెస్టు చేయాలని డీజీపీ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా ఎస్పీ నిందితుల అరెస్టు కోసం ప్రత్యేకంగా ఐదు బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన పలు ఘర్షణలకు సంబంధించి జిల్లాలో వంద కంటే ఎక్కువ మందిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణపై పోలింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదుతో 24 మందిపై కేసు నమోదైంది. ఆ ఘర్షణలకు సంబంధించే వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో 20 మందిపై కేసు నమోదైంది. ఇదే 20 మందిపై మోహిత్ రెడ్డి పీఆర్వో బండి వేణుగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.కూచువారిపల్లి మాజీ సర్పంచ్ కవిత, గ్రామస్తురాలు వనజ చేసిన ఫిర్యాదులతో ముగ్గురు వ్యక్తులను పేర్కొంటూ మరికొందరిపై అంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసులోనూ నిందితుల సంఖ్య 20 మంది దాకా వుండే అవకాశముంది. 14వ తేదీ తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరగగా ఆ కేసులోనూ పలువురిపై కేసు నమోదైంది. అక్కడే పోలీసు వాహనం వజ్రపై, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై జరిగిన దాడులకు సంబంధించి పదిమందిపై కేసు నమోదైంది. ఎమ్మార్పల్లి సీఐపై దాడి కేసులో ఎనిమిదిమందిని నిందితులుగా గుర్తించారు. ఇలా మొత్తం ఎనిమిది కేసుల్లో వంద మందికి పైనే నిందితులుగా కేసుల్లో నమోదయ్యారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం నానీపై హత్యాయత్నం కేసులో 13 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఏడు కేసుల్లో ఒక్కరినీ అరెస్టు చూపలేదు. ఆదివారం ఈ కేసులపై దృష్టి సారించిన సిట్ అధికారులు అరెస్టులు జరగని విషయాన్ని తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో అప్రమత్తమైన డీజీపీ 24 గంటల్లో మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీని ఆదేశించారు.దీంతో నిందితుల అరెస్టు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఎస్పీ రంగంలోకి దించారు. కాగా పులివర్తి నానీపై హత్యాయత్నం సందర్భంగా ఆయన గన్‌మ్యాన్ ధరణి జరిపిన కాల్పుల్లో గాయపడి చెన్నైలో చికిత్స తీసుకున్న నిందితుడొకరు డిశ్చార్జి అయినట్టు తెలిసింది. అతడిని అరెస్టు చేయడానికి అధికారులు చెన్నై వెళ్ళినట్టు సమాచారం. మరోవైపు ఎన్నికల ఘర్షణలకు సంబంధించిన నమోదైన కేసుల్లో అదనపు సెక్షన్లను చేర్చాల్సిన అవసరముందని సిట్ అధికారులు తమ నివేదికలో సిఫారసు చేసినట్టు తెలిసింది.

12 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 20: గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 12 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. నింద్రలో 21.2మి.మీ, సోమల 16.6, విజయపురం 15.2, నగరి 12.8, శాంతిపురం 12.2, సదుం 11.2, పెద్దపంజాణి 9.4, వీకోట, పాలసముద్రం 5.2, చౌడేపల్లె 4.6, కార్వేటినగరం 1.8, బైరెడ్డిపల్లెలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

23లోగా జీతాల బిల్లులు అందించాలి

ఖజానా శాఖ డీడీ రామచంద్ర

చిత్తూరు కలెక్టరేట్, మే 20: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి మేనెల జీతాల బిల్లులు ఈనెల 25కు బదులు 23వ తేదీలోగా సమీప సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అందించాలని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర ఆదేశించారు. సోమవారం డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, మే 20: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పుంగనూరులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నరసింహులు తెలిపిన ప్రకారం.. పుంగనూరు మోతీనగర్‌కు చెందిన బాలాజీ(23) కారు డ్రైవర్. కొంత కాలం క్రితం తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి నాగమణి చిరువ్యాపారం చేస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి ప్రేమను ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదని అతడికి తెలిసింది. ఆదివారం నాగమణి వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లి రాత్రి ఇంటికి వచ్చి తలుపు తట్టినా.. గట్టిగా కేకలు వేసినా స్పందన లేదు. స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి ఆమె తల్లడిల్లిపోయారు. ఏఎస్ఐ నరసింహులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలాజీ (ఫైల్‌ఫొటో)

మూడు రాష్ట్రాల్లో ఎల్లుండినుంచి గజ గణన

మంగళం, మే 20 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణనకు ముహూర్తం నిర్ణయించారు.ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఈ మూడు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు గజ గణన చేపట్టనున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకేసారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఏనుగులు దాడి చేసి పంట నష్టం, ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.శేషాచల అటవీప్రాంతంలో జరిగే గజ గణనలో 30మంది ఎఫ్ఎస్‌వో, ఏబీవో, ఎఫ్‌బీవో సిబ్బందితో చిత్తూరు డీఎఫ్‌వో పర్యవేక్షణలో ఎఫ్ఆర్వోలు పాల్గొంటారు. మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పడతారు. రెండవ రోజు ట్రాన్సక్టు లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలుచేస్తారు. ఇలాఒకేసారి మూడు రాష్ట్రాల్లో చేయడం వల్ల ఖచ్చితమైన ఏనుగులసంఖ్య వచ్చేఅవకాశం ఉందని భావిస్తున్నారు.గత సంవత్సరం శేషాచల అడవుల్లో వంద నుంచి 120వరకు గజరాజులున్నట్లు అటవీశాఖగణనలో తేలింది. చిత్తూరు అటవీప్రాంతంలో 60 నుంచి 70 వరకు, పార్వతీపురంలో 20, తిరుపతి సమీప అటవీప్రాంతంలో 30 ఉన్నట్లు గణనలో తేలింది. అయితే ఈ సంవత్సరం పెరిగాయా.. తగ్గాయా అన్న విషయమై గణన చేపట్టిన నెల రోజులకు స్పష్టత వచ్చే అవకాశముంది.

అంజప్ప.. హనుమ భక్తి

● కుటుంబ పోషణకు రామనామ సంకీర్తనలతో ఇంటింటికి
● వచ్చిన డబ్బు పొదుపుచేసి ఆంజనేయుడి గుడి నిర్మాణం
● సన్మానించిన స్థానికులు

పలమనేరు, మే 20: ప్రతి రోజూ ఏదో ఒక వీధిలో రామ నామ సంకీర్తనలు పాడుకుంటూ వెళ్తుంటారాయన. ఇలా ఐదు దశాబ్దాలుగా పలమనేరులో యాచన చేస్తున్న గొంగడి అంజప్ప దంపతులను సోమవారం స్థానికులు పూలమాల వేసి సన్మానించారు. ఎందుకిలా చేశారంటే... పట్టణ సమీపంలోని టీఎస్‌అగ్రహారం వద్ద ఉన్న కాలనీలో గొంగడి అంజప్ప నివాసం ఉంటున్నారు. తన తుంబురతో పురవీధుల్లో రామనామ సంకీర్తనలు పాడుతూ గృహస్థులు ఇచ్చే చిన్నపాటి సొమ్ము తీసుకునే వారు. తన భార్యను పోషించుకొంటూ తన స్తోమతకు మించి కాలనీలోనే తన ఆరాధ్యదైవం రాముడి భక్తుడైన అభయాంజనేయస్వామి గుడి నిర్మించారాయన. ఉదయం, సాయంత్రం అక్కడే కొంతసేపు సీతారామనామ జపంచేస్తూ స్వామివారికి దీప,దూప నైవేద్యాలను సమర్పించుకొని, పగలంతా పట్టణంలో రామనామ కీర్తన చేసుకొంటూ యాచన చేసేవారు. అంజప్పకు వయోభారం పెరగడంతో గతంలోలాగా తరచూ కాకుండా, అప్పుడప్పుడు మాత్రమే వీధుల్లో తిరుగుతున్నారు. అతడి భక్తికి, రామనామ సంకీర్తనలకు పరవశమైన ఇక్కడి యోగాగురువు నంద గోపాల్, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు, జిల్లా మేదరసంఘం మహిళాకార్యదర్శి మల్లిక బీసీ నాయకుడు పూలే గోవిందస్వామి కలిపి సోమవారం గొంగడిఅంజప్ప, గొంగడి గంగమ్మ దంపతులను సన్మానించారు.



గొంగడి అంజప్ప దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

తిరుపతి-కాట్పాడి మధ్య నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), మే 20: తిరుపతి-కాట్పాడి స్టేషన్ల మధ్య రోజువారీగా నడుస్తున్న స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కోయంబత్తూరు-తిరుపతి, విల్లుపురం-తిరుపతి, బెంగళూరు-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఈ తేదీల్లో కాట్పాడి-తిరుపతిల మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.







టమోటా పంటను ధ్వంసం చేసేసిన ఏనుగులు - నేలరాలిపోయిన మామిడి కాయలు - విరిగిన కొబ్బరి చెట్ల కొమ్మలు

వణికిస్తున్న గజదాడులు

సదుం, మే 20: సదుం మండలంలోని అటవీ శివారు ప్రాంతాల్లోని పంట పొలాలపై ఏనుగుల వరుస దాడులు స్థానికుల్లో వణుకు పుట్టిస్తోంది. గతవారం శని, ఆదివారాల్లో జోగివారిపల్లె పంచాయతీలో పంటలపై పడి నష్టపరిచిన ఏనుగులు వరుసగా మూడో రోజైన సోమవారం మళ్లీ మొరవపల్లె పంచాయతీ గంటావారిపల్లె సమీపంలోని పంట పొలాల్లో సంచరించి స్థానిక రైతులు రాజేంద్ర టమోటా పంటను తొక్కి, సులోచన మామిడి తోటలో కొమ్మలు విరిచి, కాయలు నేలరాల్చాయి. సుబ్రహ్మణ్యం కొబ్బరి చెట్లను నష్టపరిచాయి. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది జరిగిన పంట నష్టం, ఏనుగుల సంచరించి ప్రాంతాలను పరిశీలించారు. కల్లూరు-పుదిపట్ల మార్గంలోని పుల్లావానిచెరువు దగ్గర నుంచి అటవీ మార్గాన గంటావారిపల్లె సమీపానికి వచ్చి మళ్లీ అదే ప్రాంతానికి చేరి ఉంటాయని బీట్ ఆఫీసర్ మహేశ్ అన్నారు. ఏనుగులు మళ్లీ పంట పొలాల పైకి రాకుండా ట్రాక్టర్ సాయంతో మళ్లిస్తామని ఆయన తెలిపారు.

వి.కోటలో వర్షం.. చల్లబడిన వాతావరణం



వి.కోట, మే 20: మూడు రోజులుగా వరుస వానలతో వి.కోటలో వాతావరణం చల్లబడింది. ఎండవేడిమితో అల్లాడిన జనం వరుణుడి రాకతో ఉపశమనం పొందారు. సోమవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం క్రమేపీ పుంజుకుని రాత్రి వరకు కురిసింది. మండలానికి తూర్పు వైపున భారీ వర్షం పాతం నమోదుకాగా పట్టణ ప్రాంతంలో కాస్త తక్కువగా నమో దైంది. వరుస వానలతో వేరుశనగ విత్తేందుకు రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. చాలా గ్రామాలో తాగునీటి సమస్య తలెత్తగా, ఈ వానలతో నీటి సమస్య తీరుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

నేటినుంచి కల్యాణవెంకన్న బ్రహ్మోత్సవాలు



పట్నపల్లెలోని కల్యాణవెంకన్న ఆలయం

బైరెడ్డిపల్లె, మే 20 : మండలంలోని పట్నపల్లె కల్యాణవెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ధ్వజారోహణం వైభవంగా జరగనుంది. ఈనెల 29 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో 22న కల్యాణోత్సవం, 26న పుష్పపల్లకీ సేవ జరగనుంది. ఆలయ నిర్వాహకులు ఆలయం వద్ద తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయగోపురానికి నూతనంగా రంగులు వేయించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా చర్యలు చేపట్టారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో అనురాధ

బైరెడ్డిపల్లె, మే 20 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ సీహెచ్‌వో అనురాధ తెలియజేశారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలపై తగిన సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్లు గోపి, పుష్పలత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అగ్నిగుండం వెలిగింపు



కుప్పం, మే 20: కుప్పం గంగమ్మ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశానికి అవసరమైన అగ్నిగుండం వెలిగింపు కార్యక్రమం సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ వంశానుచార పూజారులు ఆలయం ఎదురుగా గల మైదాన ప్రాంతంలో అగ్ని గుండం కోసం పేర్చిన దుంగల ఎదుట పూజలు చేశారు. శాస్త్రోక్తంగా అవసరమైన అన్ని పూజలు చేసిన అనంతరం అగ్నిని రగిలించారు. అగ్నిగుండ ప్రవేశ సమయంలో భక్తులకు ఎటువంటి ఆపద కలుగకుండా రక్షించమంటూ అగ్నిదేవుని వేడుకునే క్రమంలోనే ఈ పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులతోపాటు చంద్రబాబు వ్యక్తిత కార్యదర్శి మనోహర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆర్‌ఆర్.రవి తదితరులు పాల్గొన్నారు.

సోమల టమోటాలు చెన్నైకి



సోమలలో టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సోమల, మే 20: టమోటా ధరలు పుంజుకుంటున్నాయి. దీంతో వ్యాపారస్తులు సోమల నుంచి చెన్నైకి ఎగుమతులు చేపట్టారు. సోమల మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో టమోటా సాగులో ఉంది. ఫిబ్రవరిలో నాటిన పొలాల నుంచి దిగుబడులు వస్తున్నాయి. వారం రోజులుగా ధరలు పుంజుకోవడం, దిగుబడులు తగ్గడంతో చెన్నై వ్యాపారులు సోమల, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, ఇరికిపెంట ప్రాంతాల నుంచి ఎగుమతులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో నాట్లు వేసిన తోటల్లో పంటలు పూర్తయ్యాయి. ఈ నెలల్లో నాట్లు వేసిన రైతులకు నష్టాలు మిగిలాయి.

వైభవంగా గెరిగ ఊరేగింపు



కార్వేటినగరం గ్రామ పంచాయతీ సుద్దగుంటలో సోమవారం రేణుకమాత కొలువు కార్య క్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గెరిగ ఊరేగింపునకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

- కార్వేటినగరం:

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పొలంలోకి దూసుకెళ్లిన టెంపో

సోమల, మే 20: సోమల - నాయనపాకాల మార్గంలో టమోటాలతో మార్కెట్‌కు వెళుతున్న టెంపో అదుపుతప్పి రోడ్డు పక్క ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనబోయి పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహదారులు సమీప రైతులు టెంపోను ట్రాక్టర్‌తో సహాయంతో పొలం నుంచి బయటకు లాగారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

గురుకుల పాఠశాలలకు ఆరుగురి ఎంపిక

సోమల, మే 20: సోమల మండలం నుంచి పలువురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. పెద్దఉప్పరపల్లె పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించారు. 5వ తరగతిలో చేరేందుకు జాహ్నవి, హనీ, తేజశ్రీలు బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. అదేవిధంగా డి.గౌతమ్, మోక్షిత్‌కుమార్ గ్యారంపల్లె గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. నంజంపేట పాఠశాలకు చెందిన విద్యార్థిని ఫలక్‌నాస్ కమ్మనపల్లెకు ఎంపికైనట్లు వివరించారు.

ఘనంగా మృత్యుంజయేశ్వరుడి రథోత్సవం



చౌడేపల్లె, మే20:స్థానిక బజారువీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షతులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంలో అధిష్టింప చేసి, రథాన్ని సుందరంగా పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. చిన్న రథంపై వినాయకస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలకంరించి అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. బలిజ సంఘం సభ్యులు భక్తులకు పానకం, మజ్జిగ, వడపప్పు ప్రసాదంగా పంచిపెట్టారు. బజలిసంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

మారెమ్మకు నాగజ్వాల కిరీటం



పలమనేరు, మే20 : పలమనేరు రంగాపురంలో నివాసముంటున్న హరిబాబు, రాములమ్మ దంపతుల కుమార్తె బసవేశ్వరి స్థానిక మారెమ్మ గుడిలోని అమ్మ వారికి వెండితో తయారు చేసిన నాగజ్వాల కిరీటాన్ని సోమవారం కానుకగా అందించింది. రూ.75 వేలు వెచ్చించి ఒక కిలో 5 గ్రాములతో ఈ కిరీటాన్ని తయారు చేయించి ఆలయ పూజారి బాబుకు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

పుంగనూరు రూరల్, మే20: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పుంగనూరు ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎన్‌ఎస్‌పేటకు చెందిన ఓ బాలిక చిల్లర దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు.

టోకెన్ల పంపిణీ పారదర్శకంగా ఉండాలి

- 23వ తేదీ నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ
- పుంగనూరు ఏడీఏ శివకుమార్



పులిచెర్లలో టోకెన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమార్

కల్లూరు, మే 20: వేరుశనగ విత్తనాల టోకెన్ల పంపిణీ పారదర్శకంగా ఉండాలని వ్యవసాయశాఖ పుంగనూరు ఏడీఏ శివకుమార్, ఏవో శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల మండలంలోని 12 ఆర్బీకేల్లో సోమవారం రైతులకు సబ్సిడీ ధరలతో అందించే వేరుశనగ విత్తనాలకోసం రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కల్లూరు, పులిచెర్ల ఆర్బీకేల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు, టోకెన్ల పంపిణీని ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కేజీల విత్తనకాయల బస్తా ధర రూ.1710 మాత్రమేనని రైతులకు వివరించాలన్నారు. రైతులు తప్పనిసరిగా పంట సాగుచేయాలని స్పష్టంచేశారు. 23 నుంచి విత్తనాల పంపిణీ ఉంటుందన్నారు. తొలిరోజు 120 క్వింటాళ్ల విత్తనాలకు టోకెన్లు ఇచ్చామని తెలియజేశారు.

శాంతిపురం: శాంతిపురం మండలంలో ఈ నెల 23 నుంచి వేరశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి అఫ్రోజ్ తెలిపారు. ప్రస్తుతం మండలానికి 1658.90 క్వింటాళ్లు వచ్చాయని వీటిని ఆర్బీకేలకు సరఫరా చేస్తామని వివరించారు. 23న 30-సొన్నేగానిపల్లె, మఠం, దండికుప్పం, కొలమడుగు, ఎంకేపురం, శివరామపురం ఆర్బీకేల్లో పంపిణీ చేస్తామని తెలియజేశారు. 24న సీ.బండపల్లె, 64పెద్దూరు, రాళ్లబూదుగూరు, కడపల్లె, కర్లగట్ట, చిన్నారిదొడ్డి, మొరసనపల్లె, 25న అనికెర, చెంగుబల్ల, కెనమాకులపల్లె-1, కెనమాకులపల్లె-2, అబకలదొడ్డి, గుంజార్లపల్లె, 121పెద్దూరు ఆర్బీకేల్లో విత్తనాలను పంపిణీ చేస్తామని వివరించారు. ఆసక్తిగల రైతులు ముందుగా ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పుంగనూరు రూరల్: ఈనెల 23వ తేదీ నుంచి రైతులకు వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు పుంగనూరు ఏవో రాజేశ్ తెలిపారు.

వి.కోట: వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో రాజ్యలక్ష్మి తెలియజేశారు.

సోమల: వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సంబంధించి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని పుంగనూరు ఏడీఏ శివకుమార్ తనిఖీ సోమవారం చేశారు. పుంగనూరు డివిజన్ పరిధిలోని 8మండలాలకు 12 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అనంతరం నంజంపేట, నెల్లిమంద, కందూరు ఆర్బీకేల్లో తనిఖీలు చేశారు. ఆయన వెంట ఏవో సుధాకర్, జ్యోతి, రాధిక, నవీన్, మంజు తదితరులు ఉన్నారు.

పోలింగ్ పెరగడానికి పంపకాలే కారణమా..?

పలమనేరు, మే20 : ఎన్నికలు ముగిసి వారం రోజులు గడిచిపోతున్నా పెరిగిన ఓటర్ల శాతం గురించే జనం చర్చించుకొంటున్నారు. అధికారంలో ఉన్న వైసీపీపై పెద్దఎత్తున వ్యతిరేకత కారణంగానే ఓటర్లు ఓట్లు వేసేందుకు తరలివచ్చారని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ చెబుతోంది. అధికార వైసీపీ మాత్రం జగన్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థిస్తూ మళ్లీ వైసీపీ పాలన కోసం ఓట్లు వేశారని అంటోంది. ఇప్పటి వరకు దేశంలో ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఓటింగ్ శాతం అనూహ్యంగా పెరిగితే తప్పనిసరిగా అధికార పార్టీ ఓటమిచెందడం ఎక్కువసార్లు జరిగింది. చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే అధికారపార్టీ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంది. అందుకే ఎవరిధీమాలో ఉన్నారు.

అనుకూలురకే పంపిణీ..

అభ్యర్థులు చేసిన పంపకాలే ఓటింగ్ శాతం పెరగడానికి కారణమని మరికొందరు అంటున్నారు. ఎందుకంటే గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఎన్నికల్లో ఓటర్లకు రూ. 1000నుంచి 5వేల వరకు పంచారని అందరికీ తెలిసిందే. గతంలో ఈ పంపకాలను గ్రామానికి ఒకరో, వార్డుకు ఒకరో పంపిణీ చేశారు. ఈసారి మాత్రం పోలింగ్‌కు వారం రోజుల ముందుగానే ఆయా పార్టీల నాయకులు ఇంటింటికీ వెళ్లి తమ పార్టీకి ఎవరు అనుకూలం, ఎవరు ప్రతికూలం అన్న వివరాలు సేకరించారు. ఇందుకు తగ్గట్టుగానే 90 శాతం పంపకాలు చేశారు. ఓటర్లందరిలో 90 శాతానికి కాకుండా తమ పార్టీకి కచ్చితంగా ఓటు వేసేవారిగా నిర్ధారించుకున్న వారిలో 90శాతం మందిరి తాయిలాలు పంపిణీ చేశారు. ఇలా రెండు ప్రధాన పార్టీలూ పంపకాలు చేశాయి.

ఓటరును బూత్ వద్దకు తీసుకొచ్చిన నగదు

పోలింగ్ బూత్‌ల పరిధిలో పంపకాలు చేసిన వారిలో ఒకరు బూత్ ఏజెంట్‌గా కూర్చున్నారు. పోలింగ్‌కు రాని వారి జాబితా ఆధారంగా ఎవరు పోలింగ్‌కు రాలేదో స్పష్టంగా గుర్తించే అవకాశం కలిగింది. దీంతో డబ్బు తీసుకొని ఓటు వేయకుంటే బాగుండదని దాదాపు అందరూ వచ్చి ఓట్లు వేశారు. ఎవరికి వేశామో ఏ పార్టీకి తెలియదు కాబట్టి డబ్బు తీసుకున్నా నచ్చిన వారికే ఓటు వేశారు. అదేవిధంగా మరికొందరు తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేయమంటే ఏంచేయాలి? అనే సందేహంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇలా ఓటింగ్ శాతం పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 2009 ఎన్నికల్లో 84.09 శాతం, 2014లో 84.41 శాతం, 2019లో 85.5శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 87.90 శాతం పోలింగ్ నమోదైంది. ఇలా ఓటింగ్ శాతం దాదాపు గణనీయంగా పెరిగేందుకు పంపిణీ చేసిన పెద్దమొత్తాలే కారణం.

కుప్పం గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు



పోలీసు బలగాలకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనాథ్

కుప్పం, మే 20: కుప్పంలో మంగళ, బుధ వారాలలో అంగరంగ వైభవంగా జరుగనున్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగజాతర మహోత్సవాలకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారంనాడు విశ్వరూప దర్శనం జరుగనున్నాయి. ఈ రెండు ఉత్సవాలకు ఒక్క ఆంధ్రానుంచే కాక, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలనుంచి కూడా భక్తులు పోటెత్తనున్నారు. సోమవారం రాత్రి జరిగిన అగ్నిగుండ మహోత్సవంలో కూడా భక్తులు తండోపతండాలుగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బందోబస్తు నిర్వహించడంతో పాటు, మంగళ, బుధ వారాలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందుకు తగిన ఏర్పాట్లను పోలీసులు చేస్తున్నారు. ఆదివారంనాడు జిల్లా ఎస్పీ మణికంఠ స్వయంగా కుప్పం వచ్చి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో కుప్పం అర్బన్, రూరల్ సీఐలతోపాటు ఎస్‌ఐలు, ఇతర ప్రాంతాలనుంచి పోలీసు బలగాలు శాంతిభద్రతల పరిరక్షణకు నడుం బిగించాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిఘా పెట్టాయి. సోమవారంనాడు డీఎస్పీ శ్రీనాథ్ పోలీసులకు విధులను కేటాయించారు. నిరంతరం అప్రమత్తంతగా ఉండాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఎక్కడ ఎటువంటి అసాంఘిక చర్యలకు, శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఈ సంర్భంగా ఆయన హెచ్చరించారు.

విరూపాక్షమ్మకు 108 కలశాలతో అభిషేకం



కలశాలతో ఆలయానికి తరలివస్తున్న భక్తులు



విశేషాలంకరణలో విరూపాక్షమ్మ

కల్లూరు, మే 20: పులిచెర్ల మండలం కల్లూరులో కొలువైన విరూపాక్షమ్మ ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా మహిళలు 108 కలశాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి గంగాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, దుర్గా హోమం, నవగ్రహ హోమం జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ పవేశం

ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లిలోని కావమ్మ మారయ్య వార్షికోత్సవాల్లో భాగంగా అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కలశాలను జలధిలో కలిపే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

- ప్రశ్నించిన తండ్రిపై దాడి
- కేసు నమోదు చేయని పోలీసులు
- రాజీకి వెళ్లాలంటూ ఉచిత సలహా

పుంగనూరు, మే 20: ఓ బాలిక పట్ల ఒక యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. అంతేగాకుండా ప్రశ్నించిన బాలిక తండ్రిపైనే దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకపోగా రాజీ చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. పుంగనూరులోని ఒక బాలిక (10)పట్ల వారి ఇంటి సమీపంలో ఉండే సుజయ్ అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తండ్రికి చెప్పింది. ఆ తండ్రి నిందితుడి తల్లిదండ్రులతో మాట్లాడాడు. యువకుడిని మందలించాలని సూచించాడు. అయితే నిందితుడు బాలిక తండ్రిపై దాడిచేసి రక్తగాయాలు చేశాడు. ఆ నిందితుడి తల్లిదండ్రులు సైతం బాధితురాలి తండ్రితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా రాజీ చేసుకోవాలని సూచించారు. ఓ ప్రభుత్వ టీచర్ సైతం కేసు వాపసు తీసుకోవాలని బెదిరిస్తున్నాడు. పోలీసులే రెండురోజులుగా కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఇక చేసేది లేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని బాధితులు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

23 నుంచి వేరుశనగ విత్తన కాయల పంపిణీ

కుప్పం, మే 20: ఈనెల 23నుంచి వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేయనున్నట్లు కుప్పం మండల వ్యవసాయాధికారి ఎస్.అమృతవల్లి తెలిపారు. ప్రస్తుతానికి మండలానికి 1170 క్వింటాళ్ల విత్తన కాయలు చేరాయన్నారు. రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేపడుతామన్నారు. ఒక బస్తాకు రాయితీపోగా రూ.1710 చెల్లించాలని తెలియజేశారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు ఆధార్, పాస్ బుక్‌లు తీసుకుని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని ఆమె సూచించారు. రైతులు మొబైల్ ఫోన్లు తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. అదేవిధంగా వేరుశనగ కాయలు కొనుగోలు చేసినవారు తప్పకుండా పంట సాగుచేయాలని స్పష్టం చేశారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



పాతపేటలో రాగిపంటను పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో కుసుమ

బైరెడ్డిపల్లె, మే 20 : మండలంలోని పాతపేట, కుప్పనపల్లె, కడపనత్తం గ్రామాల పరిధిలో ఆదివారం రాత్రి ఏనుగులు సంచరించాయి. పలు పంటలను ధ్వంసం చేశాయి. రాగి పంటను తొక్కేశాయి. కొబ్బరి, మా మిడి చెట్లను విరిచేశాయి. పొలాల వద్ద ఫెన్సింగ్‌ను విరగ గొట్టాయి. లక్ష వరకు పంటనష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. సమాచారం అందుకున్న ఎఫ్‌బీవో కుసుమ సోమవారం ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. తమకు పంట నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితురైతులు ఎఫ్‌బీవోకు విన్నవించారు. అలాగే ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

ఆర్వోప్లాంట్ల ద్వారా ఉచితంగా మంచినీరు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, మే20: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు ఉచితంగా మంచినీరు అందించాలని పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాగాండ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీడీవో మునిరెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా రిపేర్లు ఉంటే పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. పాళ్యంపల్లె సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ నడిమిగడిదేశి, జువ్వలదిన్నె తాండాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. గుడిసెబండ గ్రామపంచాయతీలో తాగునీరు, పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచ్ శోభ ప్రస్తావించారు. సింగిరిగుంట పంచాయతీలో తాగునీటి పైపులైన్ వేసి ఏడాది గడిచినా బిల్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా ఉందని సర్పంచ్ అంజప్ప తెలిపారు. కపాడమిట్టపల్లెలో తాగునీటిబోరుకు మోటారు ఏర్పాటు చేయాలని కోరారు. ఈడిగపల్లె, మాగాండ్లపల్లె, చంద్రమాకులపల్లె, బోడేవారిపల్లె పంచాయతీలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని సమస్య పరిష్కరించాలని సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి కోరారు. నెక్కుంది పంచాయతీ మొరంపల్లెలో తాగునీటికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించలేదని సర్పంచ్ నారాయణరెడ్డి వాపోయారు. ఎంపీడీవో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాక సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, ఈనెల జీతాలు చెల్లింపుల్లో కోత తప్పదన్నారు. సిబ్బంది విధులకు తప్పనిసరిగా యూనిఫారంతో హాజరుకావాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గొంతెండుతున్న బేవనపల్లె

- ఎండిపోయిన తాగునీటి బోర్లు
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న మహిళలు



కొద్దికొద్దిగా వస్తున్న నీటి కోసం అవస్థలు పడుతున్న మహిళలు

శాంతిపురం, మే 20: తాగునీటి సమస్యతో బేవనపల్లె వాసుల గొంతెండిపోతోంది. సీ.బండపల్లె పంచాయతీ బేవనపల్లె గ్రామం మండలానికి మారుమూల ప్రాంతం. ఈ గ్రామానికి అధికారులు ఎవరైన రావాలంటే సుమారు 15 నుంచి 20 కిలో మీటర్లు రావాల్సి ఉంటుంది. గ్రామంలో సుమారు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరి తాగునీటి కోసం గతంలో ప్రాథమిక పాఠశాల అవరణలో ఒక బోరు, గ్రామానికి కొంత దూరంలో మరో బోరు వేశారు. గతంలో వర్షాలు బాగా కురవడంతో రెండు బోర్లలోనూ నీరు పుష్కలంగా ఉంది. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోరు బావులు సైతం ఇంకిపోయాయి. ఈ క్రమంలోనే బేవనపల్లె గ్రామంలోని రెండు బోర్లలో ఒకటి పూర్తిగా అడుగంటి పోయింది. మరొకదానిలో అరకొరగా వస్తోంది. ఆనీరు చాలడంలేదు. పది నిముషాలు నీరు వస్తాయి. తర్వాత రావు. మళ్లీ కొంతసేపటి తర్వాత వస్తాయి. ఈ బోరులో అదనంగా పైపులు దించితే సమస్య పరిష్కారం అవుది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నీటికోసం అక్కడి మహిళలు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఎన్నికల సమయంలో రెండు వారాల పాటు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. తర్వాత ఆ ఊసేలేదు. నీటి సమస్య ఏర్పడినప్పటి నుంచి పలుసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పిన పట్టించుకోలేదని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరున్న బోరులో అదనపు పైపులు దించడంతో బోటు మరో కొత్త బోరు వేసి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీరు అడుగంటిపోయిన బోరు, నీరు ఉన్నా నిరుపయోగంగా ఉన్న బోరు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి సేవలో సింహాచల ఆలయ ఈవో



ఐరాల(కాణిపాకం), మే 20: సింహాచల ఆలయ ఈవో శ్రీనివాస మూర్తి సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

ఐరాలలో జాతర చాటింపు

ఐరాల, మే 20: గార్గేయ నదీ తీరాన వెలసిన పాలేటమ్మ గంగ జాతర నిర్వహణ కోసం సోమవారం రాత్రి గ్రామస్తులు చాటింపు వేశారు. అమ్మవారికి మహిళా భక్తులు 101 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.

23 నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

పాలసముద్రం, మే 20: ఈ నెల 23వ తేదీ నుంచి రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామని ఏవో డిల్లీబాబు తెలిపారు. మండలానికి 540 క్వింటాళ్ల కే6 రకం విత్తనకాయలు వచ్చాయని పేర్కొన్నారు. 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,850 కాగా సబ్సిడీ రూ.1,140 పోను రూ.1,710 చెల్లించి రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవాలని కోరారు.

నానీకి భీమనేని పరామర్శ



పాలసముద్రం, మే 20: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ మరుసటి రోజు జరిగిన వైసీపీ శ్రేణుల దాడిలో నాని గాయపడిన విషయం విదితమే.

ఆయురారోగ్యాలతో ప్రజలు సుఖంగా ఉండాలి

చిత్తూరు సిటీ, మే 20: నగర ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని టీడీపీ నేతలు ఆకాంక్షించారు. గంగ జాతర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గంగమ్మ కృపా కటాక్షాలతో సకాలంలో వర్షాలు కురిసి, సమస్యలు లేకుండా చూడాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, మాజీ మేయర్ కఠారి హేమలత, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ ఆకాంక్షించారు.

పరిహారమిచ్చి పనులు చేపట్టండి



అధికారులతో చర్చిస్తున్న రైతులు, పోలీసులు

బంగారుపాళ్యం, మే 20: పరిహారం చెల్లించి మండలంలో బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేపట్టాలని రైతులు సోమవారం హైవే అధికారులను అడ్డుకున్నారు. తమ భూమికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పోలీసులు జోక్యం చేసుకుని అధికారులు, రైతులతో చర్చించారు. పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతులు కళాధర్ నాయుడు, మురళీరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచి గరుడసేవ ఉత్సవాలకు ఏర్పాట్లు



చలువ పందిళ్లు

నగరి మే20: పట్టణ పరిధిలోని కరియమాణిక్య స్వామి దేవాలయంలో ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న కంచి గరుడ సేవకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. టీటీడీ ఆధీనంలోని ఈ ఆలయంలో కంచిగరుడసేవను వైభవంగా నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున అందుకు తగినట్లు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై మాడవీధుల్లో ఊరేగిస్తారు. సోమవారం డిప్యూటీ ఈవో నాగరత్నం ఏర్పాట్లను పరిశీలించారు.

షెడ్డు నిర్మాణానికి చెట్ల నరికివేత



బంగారుపాళ్యం, మే 20: మార్కెట్ యార్డులో ప్రైవేటు వ్యక్తుల షెడ్డు నిర్మాణానికి పదేళ్ల నాటి చెట్లను నరికేయడం వివాదాస్పదమైంది. మండీ యజమానులు, మామిడి రైతులు షెడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ప్రవేశ ద్వారం వద్ద షెడ్డును ఎలా నిర్మిస్తారని కార్యదర్శి వెంకటరమణ, సూపర్‌వైజర్ గంగయ్యలను ప్రశ్నించారు. నిర్మాణాన్ని ఆపకపోతే మూకుమ్మడిగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకే సంవత్సరం అగ్రిమెంటు ఇచ్చినట్లు కార్యదర్శి తెలిపారు.

జాతరలో అప్రమత్తంగా ఉండాలి

పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మే 20: నగరంలో మంగళ, బుధవారాల్లో జరిగే నడివీధి గంగమ్మ జాతరలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. బందోబస్తులో పాల్గొనే పోలీసులతో సోమవారం ఆయన పాత పోలీసు మైదానంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతరకు పెద్దయెత్తున భక్తులు హాజరవుతారని, దానికి తగినట్లు విధులు నిర్వహిస్తూ ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనల విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఘర్షణలు జరిగే అవకాశం ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పిక్ పాకెటింగ్‌పై ఓ కన్నేసి ఉంచాలన్నారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

గంగజాతరను పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను నగర కమిషనర్ అరుణ పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతాల్లో నిర్వాహకులతో సమీక్షించారు.

అగ్ని ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

చిత్తూరు (సెంట్రల్), మే 20: అగ్ని ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలని క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథన్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంపులో భాగంగా సోమవారం ఫైరింగ్‌పై అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్యాస్ లీకైనప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే దానిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శోభన్, కుశలన్, బాలాజీ, సతీష్, లోకేష్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, గిరిధర్, రమేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడిలోకి 230 మంది బడిబయటి పిల్లలు

చిత్తూరు (సెంట్రల్), మే 20: వివిధ కారణాలతో బడిమానేసిన 230 మంది పిల్లలను గుర్తించి బడిలో చేర్పించినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సహకారంతో సమగ్ర శిక్షలోని సహిత విద్యా విభాగం బడిబయటి పిల్లలపై సర్వే నిర్వహిస్తోందన్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గాల్లోని 230 మంది పిల్లలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో బడిలో చేర్పించినట్లు తెలిపారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఆవుదేవర నందీశ్వరస్వామి - కొండమల్లీశ్వరస్వామికి పూజలు

వెదురుకుప్పం, మే 20: మండలంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. అర్చనలు, అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భజన కళాకారులు శివుడు, అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పల్లకీ సేవ నిర్వహించారు. చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. కాగా, కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో ఏకకాలంలో కొండమల్లీశ్వరుడికి, నందీశ్వరుడికి ప్రదోష కాల పూజలు నిర్వహించారు.

గిరింపేట గంగజాతర బ్రోచర్ ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, మిత్రబృందం

చిత్తూరు కల్చరల్, మే 20: గిరింపేట గంగజాతర మహోత్సవ కరపత్రాలను ఉత్సవ ధర్మకర్త, డిప్యూటీ మేయర్ ఆర్.సి.చంద్రశేఖర్ సోమవారం తన మిత్రులతో కలిసి ఆవిష్కరించారు. మంగళ, బుధవారాల్లో జరిగే గిరింపేట నడివీధి గంగమ్మ జాతరలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

విటమిన్స్‌పై విద్యార్థులకు అవగాహన



కార్వేటినగరం, మే 20: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు విటమిన్స్‌పై స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ టీచర్ మర్రి మునిరాజ విద్యార్థులకు విటమిన్స్ గురించి తెలియజేశారు. గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ట్యాంకు పరిసరాలు



కార్వేటినగరం, మే 20: కార్వేటినగరం పంచాయతీ పరిధిలోని పాత సంత వీధిలో నీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ట్యాంకు చుట్టూ మురికి నీరు నిల్వ ఉంది. ట్యాంకు నుంచి లీకైన నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి లీకేజీని అరికట్టండి



కార్వేటినగరం, మే 20: ఆర్‌కేవీబీ పేట గ్రామ పంచాయతీ కేంద్రంలో పైప్‌లైన్ లీకవుతుండడంతో రోడ్డుపై నీరు ప్రవహిస్తూ బురదమయమైంది. తద్వారా పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిపై పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వైభవంగా గెరిగ ఊరేగింపు



కార్వేటినగరం, మే 20: కార్వేటినగరం గ్రామ పంచాయతీ సుద్దగుంటలో సోమవారం రేణుకమాత కొలువు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గెరిగ ఊరేగింపునకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవ నిర్వాహకులు ప్రసాదాలు వితరణ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బంగారుపాళ్యం, మే 20: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వాహన మండపం దుకాణం సీజ్

చిత్తూరు కల్చరల్, మే 20: చర్చివీధిలోని కోదండరామాలయ వాహన మండపంలో ఎర్రగడ్డల మండీని సోమవారం ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు సీజ్ చేయించారు. ఆలయం కోసం తయారు చేయించిన రథాన్ని భద్రపరచడానికి నిర్మించిన మండపంలో ప్రైవేటు వ్యక్తి ఎర్రగడ్డల మండీ నిర్వహించడం వివాదాస్పదమైన విషయం విదితమే. దీనిపై దేవాదాయ శాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సోమవారం మండీని ఖాళీ చేయించి, సీజ్ చేశారు.

26న యోగా పరిచయ కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, మే 20: గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు, సాయంత్రం 6 గంటలకు సిద్ధి సమాధి యోగా పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు యోగా గురువులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య తెలిపారు. యోగాతోపాటు పలు ఆరోగ్యసూత్రాలను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. నగర వాసులు హాజరుకావాలని కోరారు.

40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాల పంపిణీ



వ్యవసాయ శాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ సౌభాగ్యలక్ష్మి

గంగాధరనెల్లూరు, మే 20: 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు నగరి వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం, పాలసముద్రం మండలాలకు చెందిన ఏవో, ఆర్బీకే సిబ్బందితో సోమవారం ఆమె సమీక్షించారు. ఈనెల 23వ తేదీ నుంచి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌లతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవోలు వందన, డిల్లీ ప్రసాద్, నర్మదా, జిల్లా కేంద్రం టెక్నికల్ ఏవో యామిని పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

శ్రీరంగరాజపురం : ప్రభుత్వ అందించే రాయితీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారిణి నర్మద కోరారు. మండలానికి 810 క్వింటాళ్లు వచ్చాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో ఈనెల 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

23నుంచి పంపిణీ

వెదురుకుప్పం : రైతులకు నలభై శాతం రాయితీతో వేరుశనగ కాయలను ఈనెల 23 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి సి.వనిత సోమవారం తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధారు కార్డు, ఫోన్ నంబరు తీసుకెళ్లాలని సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి

బంగారుపాళ్యం : వేరుశనగ విత్తనకాయలు అవసరమైన రైతులు ఈనెల 23వ తేదీ నుంచి ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో చిట్టిబాబు కోరారు. మండలానికి 1,980 క్వింటాళ్లు కావాల్సి ఉండగా, 1,334 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్ల తొలగింపు



బోడిబాపన గుంట వద్ద అక్రమ కనెక్షన్‌ను తొలగిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

కార్వేటినగరం, మే 20: కార్వేటినగరం గ్రామ పంచాయతీ బోడిబాపన గుంట వద్ద విద్యుత్‌స్తంభం నుంచి ఏర్పాటు చేసిన అక్రమ కనెక్షన్లను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. విచ్చలవిడిగా విద్యుత్ చౌర్యం శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. అక్రమ కనెక్షన్లను తొలగించడంతోపాటు అదనపు లోడ్ వాడుతున్న 50 మంది వినియోగదారులను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కరిమబ్బుల సోయగం

చిత్తూరు నగరాన్ని సోమవారం సాయంత్రం కరిమబ్బులు కమ్మేశాయి. దాదాపు 10 నిమిషాలు చీకట్లు అలముకున్నాయి. కనువిందైన ఈ దృశ్యాన్ని నగరవాసులు ఆస్వాదించారు. కొద్దిసేపటికే వర్షం కురవడంతో మేఘాలు కనుమరుగయ్యాయి. యువకులు వర్షంలో తడుస్తూ ఉల్లాసంగా గడిపారు. - చిత్తూరు కలెక్టరేట్